విశాలాంధ్ర కృష్ణా జిల్లా

చిరు వ్యాపారులకు జగనన్న తోడు

విశాలాంధ్ర-మచిలీపట్నం : వడ్డీలేని రుణాలను అందిస్తూ చిరు వ్యాపారుల ఉపాధికి జగనన్న తోడు పథకం అండగా నిలబడు తుందని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అన్నారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం నుండి సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చిరు వ్యాపా రులు, సాంప్రదాయ వృత్తిదారు లకు జగనన్న తోడు పథకం 6వ విడత ద్వారా రూ. 10 వేల వరకు ఆర్థిక సహాయం, అదే విధంగా గతంలో బ్యాంకుల నుండి రుణాలు పొందిన వారికి వారి బ్యాంకు ఖాతాల్లో వడ్డీ జమచేసే కార్యక్రమంలో కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా వర్చువల్గా పాల్గొన్నారు. పూర్తి వడ్డీ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తూ ఒక్కొక్కరికీ రూ. 10 వేల చొప్పున జిల్లాలో ఇప్పటి వరకు 56,253 మంది లబ్ధిదారులకు రూ.57.27 కోట్లను 5 విడతలుగా మంజూరు చేసింది. మచిలీపట్నం నియోజకవర్గం పరిధిలో 3,997 మంది లబ్ధిదారులకు రూ.11.15 లక్షలు, అవనిగడ్డ నియోజకవర్గం 4,676 మంది లబ్ధిదారులకు రూ.10.10 లక్షలు, గన్నవరం నియోజకవర్గం 3,761 మంది. లబ్ధిదారులకు రూ.9.97 లక్షలు, గుడివాడ నియోజకవర్గం 3,060 మంది లబ్ధిదారులకు రూ.7.25 లక్షలు, పామర్రు నియోజకవర్గం 6,279 మంది లబ్ధిదారులకు రూ.15.33 లక్షలు, పెడన నియోజకవర్గం 4,192 మంది లబ్ధిదారులకు రూ.10.23 లక్షలు, పెనమలూరు నియోజకవర్గంలో 5,085 మంది లబ్ధిదారులకు రూ.11.54 లక్షలు కలిపి మొత్తం 31,050 మంది లబ్ధిదారులకు రూ.75.58 లక్షల వడ్డీ రాయితీని రాష్ట్ర ప్రభుత్వం జమ చేసింది. ఈ కార్యక్రమంలో డిఆర్ డిఎ పీడీ పిఎస్ఆర్.ప్రసాద్, మచిలీపట్నం నగరపాలక సంస్థ కమీషనర్ చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

25 లోపు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

విశాలాంధ్ర-మచిలీపట్నం : జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని ఈనెల 25వ తేదీ లోపున ఆశించిన స్థాయిలో పురోగతి లేకపోతే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను హెచ్చరించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్ తో కలిసి మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వర్లు, డ్వామా పి.డి. జీవి సూర్యనారాయణ, పంచాయతీరాజ్ ఎస్ ఇ ఎం. ఈరాస్వామి, టిడ్కో ప్రాజెక్ట్ ఆఫీసర్ బి.చిన్నోడు, హౌసింగ్ ఈఈ , మున్సిపల్ కమీషనర్లు, అన్ని మండలాల తాసిల్దార్లు, ఎంపీడీవోలు, లేఅవుట్ స్పెషల్ ఆఫీసర్లు, నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్లు, విద్యుత్, ఆర్డబ్ల్యూఎస్, హౌసింగ్ డిఈలు, ఏఈలు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

'బరి'తెగింపు!

- బరికి భూమి పూజ!
- ఉమ్మడి జిల్లాలో కోడిపందేలకు ముమ్మరంగా ఏర్పాట్లు.. భారీగా సిద్ధం చేస్తున్న బరులు
- విజయవాడ రూరల్ మండలంలో కొత్త బరులకు పూజలు
- 5 రోజుల మందు నుంచే సదుపాయల కల్పనకు చర్యలు
- పోలీసుల హెచ్చరికలు బేఖాతర్

అంబాపురం పంచాయతీ పరిధిలో కోడిపందేల బరి ఏర్పాటుకు పూజలు చేస్తున్న నిర్వాహకులు

విశాలాంధ్ర-విజయవాడ క్రైం : సంక్రాంతి పండుగ సందర్భంగా సంప్రదాయంగా కోడిపందేలు నిర్వహించడం ఆనవాయితీ. అయితే జిల్లాలో కొత్తగా కోడిపందేల బరుల ఏర్పాటుకు కూడా సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహిస్తున్నారు. బరుల ఏర్పాటుకు ఎంపిక చేసుకున్న ప్రదేశానికి పూజారులను తీసుకువచ్చి కర్రకు పసుపు, కుంకుమ వంటివి రాసి పూజలు చేస్తున్నారు. ఆ తర్వాత బరుల ఏర్పాటు పనులు ప్రారంభిస్తున్నారు. ఈ ఏడాది ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఈ సంప్రదాయం కొత్తగా కనిపిస్తోంది. ఈ దృశ్యాలను చూసినవారు ఇదెక్కడి సంప్రదాయమని ఆశ్చర్యపోతున్నప్పటికీ, ఈ ఏడాది గోదావరి జిల్లాలకు దీటుగా ఉమ్మడి కృష్ణా జిల్లాలో పందేలు ఉంటాయని భావిస్తున్నారు.

వారం రోజుల నుంచే...

సంక్రాంతి పండుగకు వారం రోజుల ముందుగానే కోడి పందేలకు నిర్వాహకులు సర్వం సిద్ధం చేస్తున్నారు. ఈ ఏడాది అనూహ్యంగా కొత్త ప్రదేశాల్లో కూడా భారీ ఎత్తున బరులు సిద్ధంచేస్తున్నారు. పోలీసులు హెచ్చరిస్తున్నా... అక్కడక్కడా తనిఖీలు నిర్వహించి కోడి కత్తులు వంటివి స్వాధీనం చేసుకుంటున్నా.. నిర్వాహకులు మాత్రం ఏమాత్రం లెక్క చేయకుండా చాలా ధీమాగా భారీగా బరులు సిద్ధం చేస్తున్నారు. తమకు ఎటువంటి ఆటంకాలు ఉండబోవని, సకల సదుపాయాలు కల్పిస్తామని ఇప్పటి నుంచే ప్రచారం చేస్తూ పందెపురాయుళ్లను ఆకర్షించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లా అంతటా...

గత ఏడాది కోడిపందేలు ఉమ్మడి కృష్ణా జిల్లాలోని పెనమలూరు, గుడివాడ, గన్నవరం, మైలవరం, నందిగామ నియోజకవర్గాల్లో పెద్ద ఎత్తున నిర్వహించారు. విజయవాడలోని భవానీపురం, కొత్తూరు తాడేపల్లి, అంబాపురం, గ్రామాల్లోనూ పెద్ద ఎత్తున పందేలు జరిగాయి. గుడివాడలో క్యాసినో, కంచిచర్లలో పేకాట విషయం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. ఈ ఏడాది దాదాపు పాత ప్రాంతాలతోపాటు నున్న, మరికొన్ని కొత్త ఏరియాల్లోనూ బరుల ఏర్పాటుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఎక్కడికక్కడ ఖాళీ స్థలాలు, పొలాలను చదువును చేసి బరుల ఏర్పాటు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కొత్తగా భారీ బరులు ఏర్పాటు చేసేవారు పూజారులను తీసుకువచ్చి పూజలు కూడా చేయిస్తుండటం విశేషం.

పేకాట, ఇతర జూదాలు... మద్యం...

కోడిపందేల బరులను భారీ ఎత్తున ఏర్పాటు చేస్తున్న నిర్వాహకులు... అక్కడే పేకాట, గుండాట, ఇతర జూదాల నిర్వహణకు, మద్యం, బిర్యానీ సిద్ధంగా ఉంచేందుకు ఇప్పటి నుంచే తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు తమకు తెలిసినవారి ద్వారా పందెపురాయుళ్లను ఆకర్షించే ప్రయత్నాలు చేస్తున్నారు. డబ్బు సంపాదించేందుకు ఉన్న ప్రతి అవకాశాన్ని వినియోగించుకోవాలని భావిస్తున్నారు. జూదాల నిర్వహణ, మద్యం, బిర్యానీ అమ్మకాలతోపాటు వాహనాల పార్కింగ్ ఫీజు వసూలుకు కూడా చేసేందుకు టోకెన్లు కూడా సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది.

రంగు మారిన ధాన్యం కొనుగోలుకు సహకరించాలి

విశాలాంధ్ర-కూచిపూడి : గత ఏడాది వరికోతల సమయంలో సంభవించిన "మాండ్రూస్" తుఫానుకు కురిసిన అధిక వర్షాలతో రంగు మారిన ధాన్యం, చెడిపోయిన ధాన్యం బహిరంగ మార్కెట్లో మిల్లర్ల ద్వారా కొనుగోలు చేయడానికి ప్రభుత్వం ఆ ధాన్యానికిమద్దతు ధర ప్రకటించినట్లు మొవ్వ తహసిల్దార్ సిహెచ్ వీరాంజనేయ ప్రసాద్ పేర్కొన్నారు. ఆయన కూచిపూడి లోని బార్లపూడి రోడ్ లో గల విజయసాయి రైస్ మిల్ లో కొనగోళ్ళపై తనిఖీలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రకృతి విపత్తు వల్ల దెబ్బతిన్న రైతులకు న్యాయం చేయడానికి వీలుగా ప్రకటించిన మద్దతు ధరలను అందించి చేయూతనివ్వాలని ఆదేశించారు. రంగు మారిన ధాన్యం కొనుగోలు విషయంలో మిల్లర్లు, ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులు ఈ విషయాలను తప్పక పాటించాలని ఆంజనేయ ప్రసాదు సూచించారు.

కొమ్మారెడ్డిలో అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర-బంటుమిల్లి : కొమ్మారెడ్డి పాఠశాలలో బుధవారం సంక్రాంతి సంబరాలను పాఠశాల డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్ నేతృత్వంలో ఘనంగా నిర్వహించి సంక్రాంతి పండుగా విశిష్టతని విద్యార్థులకు కళ్ళకు కట్టినట్లుగా వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యతిథిగా బంటుమిల్లి సర్పంచి వెంట్రప్రగడ కృష్ణవేణీ పాల్గొని సంక్రాంతి సంబరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్ మాట్లడుతూ సంక్రాంతి పండుగను రైతులు ఎంతో ఆనందోత్సావాలతో జరుపుకుంటారన్నారు. వివిధ పోటిలలో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు నగదు బహుమతి, మెమోంటోలను సర్పంచి కృష్ణవేణీ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో స్తునం సతీష్, స్తునం మహేష్ ,ఉపాధ్యాయులు ,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గోన్నారు.

ప్రారంభమైన జాతీయస్థాయి ఎండ్లబండలాగుడు పోటీలు

విశాలాంధ్ర-గుడివాడ : ఎన్‌టిఆర్ టు వైఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయస్థాయి ఎడ్ల బండలాగుడు ప్రదర్శనను పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ ప్రారంభించారు. బుధవారం స్థానిక లింగవరం రోడ్డులోని కే కన్వెన్షన్‌లో ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని), అయన సోదరుడు చిన్నిల సహకారంతో ప్రతి సంవత్సరం నిర్వహించే ఎడ్ల బండలాగుడు పోటిలను ఎమ్మెల్యే అనిల్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు దుక్కిపాటి శశిభూషణ్, పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, నందివాడ ఎంపీపీ పేయ్యల ఆదాం, వైసిపి రూరల్ మండల అధ్యక్షుడు మట్టా జాన్‌విక్టర్, ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు పాలేటి చంటి, పాలడుగు రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

'త్రివేణి'లో సంక్రాంతి క్రీడా పోటీలు

విశాలాంధ్ర-గుడివాడ : వెనిగండ్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా బుధవారం స్థానిక పాటిమీద గల త్రివేణి పబ్లిక్ స్కూల్ సెంటర్‌లో సాంప్రదాయక ఆటల పోటీలు మ్యూజికల్ చైర్స్, లెమన్ స్పూన్, ప్లేట్ అండ్ గోలీలాట, కార్యక్రమలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న వెనిగండ్ల ఫౌండేషన్ అధినేత వెనిగండ్ల రాము మాట్లాడుతూ త్రివేణి పబ్లిక్ స్కూల్ విద్యార్థులు అన్ని సంప్రదాయ పోటిలలో ప్రతిభను కనబర్చడం అభినందనీయమన్నారు. అనంతరం ఆటల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ శంకర్, శంకరంపాడు సర్పంచ్ కైలే సుబ్బారావు, ఫౌండేషన్ సభ్యులు దేవరపల్లి వినయ్‌ప్రకాష్, గొర్రె ముచ్చు వెంకటనరసింహారావు, తుమేటి శ్రీనివాసరావు, గూడపాటి ప్రశాంతి, గోరుముచ్చుమణి, వై.వీరకుమారి, తబిత, స్వర్ణకుమారి, బొట్టు వెంకయ్య, మెరుగు ప్రసాదు, రుంజల రవి, కల్లేపల్లి పవన్, తరుణ్, బాబి, దమ్ము వెంకటేష్, బోడపాటి నరేష్, తదితరులు పాల్గొన్నారు.

యువకుడు అనుమానాస్పద మృతి

విశాలాంధ్ర-మచిలీపట్నం : స్థానిక వల్లూరి రాజా సెంటర్లో హ్యాపీ డే హోటల్లో చెఫ్‌గా పనిచేస్తున్న యువకుడు బుధవారం అనుమానాస్పద మృతి చెందాడు. ఆర్‌పేట సిఐ కొండయ్య చెప్పిన వివరాలు ఇలా ఉన్నాయి. మచిలీపట్నం వల్లూరిరాజ సెంటర్లో హ్యాపీడేలో హోటల్లో చెఫ్‌గా పనిచేస్తున్న కుక్కల మోహన్ (22) వంట గదిలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉదయమే రెస్టారెంట్ యజమాని వచ్చి చూడగా మోహన్ ఫ్యాన్ కు వ్రేలాడుతూ కనిపించడంతో పోలీస్లకు సమాచారం అందించడం జరిగిందన్నారు. పోలీసులు సంఘటన స్థలానికి హుటాహుటును వెళ్ళగా కుక్కల మోహన్ ది మండలం కురుమద్దాలి గ్రామానికి చెందిన వాడిని ఇతను గతకాలంగా ఒక ఆమెతో ప్రేమలో ఉన్నారని, ఆ విషయమై ఈరోజు రెస్టారెంట్ లో ఉరి వేసుకుని ఆత్మహత్యకి పాల్పడి ఉంటాడని ఆయన తెలిపారు. మచిలీపట్నంలోని ప్రభుత్వ సర్వ జన ఆస్పత్రికి తీసుకొని వెళ్లడం జరిగినది.ఆర్ పేట పోలీసులు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సొంత నిధులతో రహదారి ఏర్పాటు

విశాలాంధ్ర-అవనిగడ్డ : సర్పంచ్‌గా ఎన్నికయిన మొదలు పంచాయితీలో నిధులు ఉన్నా లేకున్నా గ్రామాన్ని అభివృద్ధి చేయడంలో ఏ మాత్రం ఆలోచించకుండా ముందుకు సాగుతున్న గ్రామ సర్పంచ్ పి.ఎస్.ఎల్ ప్రసాద్ ను పలువురు అభినందనలతో ముంచేత్తుతున్నారు. మండల పరిధిలోని అశ్వరావుపాలెం గ్రామానికి చెందిన సర్పంచ్ లంకమ్మ ప్రసాద్ పంచాయితీకి సర్పంచ్ ఎన్నికైన నాటి నుండి సొంత నిధులను సైతం వెచ్చించేందుకు వెనుకడుగు వేయకుండా ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు నడుము కట్టి అభివృద్ధి చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

గూడూరు మండలంలో వేదవ్యాస్ పర్యటన

విశాలాంధ్ర- గూడూరు: గూడూరు మండలంలో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్ బుధవారం పర్యటించారు. కంకటావ పంచాయతీలో పర్యటించి గ్రామ సమస్యలు తెలుసుకున్నారు. పంచాయతీ కత్తిరెడ్డి వానిపాలెంలో కూలిపోయిన వంతెనను ఆయన పరిశీలించి సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. అలాగే గ్రామంలో మరికొన్ని సమస్యలను ప్రజలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు.కంకటావ సర్పంచ్ మద్దాల బాబురావు, వైస్ ప్రెసిడెంట్ శివ నారాయణరావు, వాకా శ్రీనివాస్‌రావు, ఎక్స్ ఎంపీటీసీ శ్రీనివాస్, ఎర్రపోతు గంగన్న, తోట పోతురాజు, తోట శివన్నారాయణ, బూరగడ్డ బిక్షం , బూరగడ్డ భాను, పెన్నేరు రాధాకృష్ణ గోపాల్, సుంకర కనకరాజు, కొల్లూరి కోటేశ్వరరావు, టిడిపి నాయకులు, కార్యాకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

డ్రైవ్.అహెడ్ , ఆటో ఎక్స్ పో 2023 లో ఎంజి మోటార్ ఇండియా ఆవిష్కరణ

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ఎంజి మోటార్స్ ఇండియా ఈరోజు ఆటో ఎక్స్ పో 2023 లో భవిష్యత్ చలనశీలత , డ్రైవ్.అహెడ్ కోసం తన దార్శనికతను ప్రదర్శించింది. కంపెనీ పోర్ట్ ఫోలియో నుంచి ఉత్పత్తికి సిద్ధంగా ఉన్న 14 వాహనాల శ్రేణిని ఆవిష్కరించింది. శ్రీ రాజీవ్ ఛబా, ప్రెసిడెంట్, ఎండీ, ఎంజి మోటార్స్ ఇండియా , మాట్లాడుతూ స్థిరమైన, మానవీయమైన, సహజమైన సాంకేతికతతో నడిచే ప్రపంచం దిశగా పనిచేయాలని విశ్వసిస్తున్నామన్నారు.

చిజ్జాను మళ్లీ అందుబాటులోకి తీసుకు వచ్చిన కేఎఫ్‌సీ

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్) : ఈ కొత్త సంవత్సరం అత్యంత సంతోషమయంగా ప్రారంభం కాగా, కేఎఫ్‌సీ తన చిజ్జాను తిరిగి అందుబాటులోకి తీసుకు వస్తున్నట్లు ప్రకటించింది. అందరికీ అత్యంత ఇష్టమైన కేఎఫ్‌సీ చిజ్జాలు మరోసారి భారీ తరహాలో అందుబాటులోకి వస్తుండగా, 2023లో అత్యంత భారీ బ్లాక్‌బస్టర్ కానున్నాయి. ఫుడీస్ అత్యంత ఇష్టపడే రెండు అంశాలైన చికెన్, ఛీజ్‌ను కలిపి తీసుకువచ్చిన కెఎఫ్‌సీ చిజ్జా నోరూరిస్తుంది. ఈ ఉత్పత్తి పలు సంవత్సరాల నుంచి కేఎఫ్‌సీ అభిమానుల నుంచి అపారమైన ప్రేమను అందుకోగా, కెఎఫ్‌సీ వారి కరకరలాడే చికెన్ పైభాగంలో, దిగువ ఎక్కువ కరకరలాడే చికెన్‌తో ఇష్టమైన ఆహార పదార్థంగా నిలిచింది.

కరగ్రహారం లే అవుట్ మెరక పనులకు సహకరించాలి

విశాలాంధ్ర-మచిలీపట్నం : నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించిన కరగ్రహారం జగనన్న లే అవుట్ మెరక చేయడానికి బే ఆఫ్ బెంగాల్ ల్యాండ్ (ప్రభుత్వ భూమి) నుండి దిబ్బలుగా ఉన్న మట్టి తరలించి మెరక చేయడానికి ఉపయోగించడం జరుగుతున్నదని బందరు తహసిల్దారు డి. సునీల్ బాబు తెలిపారు. బుధవారం బందరు మండలం తపసిపూడి గ్రామం వద్ద బే ఆఫ్ బెంగాల్ ల్యాండ్ (ప్రభుత్వ భూమి) నందు దిబ్బలుగా ఉన్న మట్టి తరలించే పనులు తహసిల్దారు రెవెన్యూ, పోలీస్ సిబ్బందితో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా తహసిల్దారు మాట్లాడుతూ కొంత మంది కొంత మంది జనసేన జెండాలతో వచ్చి వాటర్ రావచ్చనే భయంతో మట్టి తరలింపు పనులు ఆపారని, వారికి వాస్తవాలు వివరించడం జరిగిందని, పనులు తిరిగి ప్రారంభించడం జరిగిందన్నారు. గ్రామానికి చాలా దూరంగా ఉన్న దిబ్బలుగా ఉన్న ప్రాంతంలో నే మట్టి తరలించడం జరుగుచున్నదని అన్నారు. పోర్టు అభివృద్ధి కోసం డ్రెడ్జింగ్ చేసేటప్పుడు వచ్చే మట్టితో గుంటలు తిరిగి పూడ్చే చర్యలు తీసుకోనేలా గుత్తేదారులకు చెప్పడం జరుగుతుందన్నారు. ఎవరికైన అభ్యంతరాలు ఉంటే తహసిల్దారు కార్యాలయంలో సంప్రదించి తమ అనుమానాలు నివృత్తి చేసుకోవచ్చని, అంతేగాని పనులు ఆపకూడదని అన్నారు. మంచి పని కోసం ప్రభుత్వం చేస్తున్న పనులకు సహకరించి పేదలు వారికిచ్చిన ఇళ్ల స్థలాల్లో ఇళ్లు నిర్మించుకునేలా చూడాల్సి అవసరం ఉందన్నారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో పూరిగుడిసె దగ్ధం

రూ.2.50 లక్షలు ఆస్తి నష్టం

విశాలాంధ్ర-అవనిగడ్డ : విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గెదేల పాకకాలిన ప్రమాదంలో రెండు గెదేలు మృతి చెందగా, మరో మూడు గెదేలు తీవ్రంగా గాయపడ్డాయి. అగ్నిమాపక శాఖా అధికారి పిఎస్‌వివి ప్రసాద్ వివరాల ప్రకారం మండల పరిధిలోని వేకనూరు గ్రామం డి.వై దాస్ కాలనీలో ఈ నెల 10వతేదీన జరిగిన విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో గెదేల పూలపాక కాలిపోయిందని, ఈ అగ్నిప్రమాదంలో రెండు గెదేలు మృతిచెందాయని అన్నారు. రూ.2.50 లక్షలు ఆస్థినష్టం జరిగినట్లు చెప్పారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది హుటాహుటీగా ఘటన స్థలానికి చేరుకుని చుట్టు ప్రక్కలకు మంటలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకున్నారు. విషయం తెలుసుకున్న జనసేన మండల పార్టీ అధ్యక్షులు గుడివాక శేషుబాబు ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు.

డెల్టా ప్రాజేక్టు కమిటీ మాజీ చైర్మన్ గుత్తా

విశాలాంధ్ర-గుడివాడ : టిడిపి కుటుంబ సభ్యులకు స్థానిక ఏలూరురోడ్డులోని వెంకటేశ్వర ఫంక్షన్ హాల్‌లో అత్మీయ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు డెల్టా ప్రాజేక్టు కమిటీ మాజీ చైర్మన్ గుత్తా శివరామకృష్ణ(చంటి) తెలి పారు. బుధవారం స్థానిక వెంకటేశ్వర ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో టిడిపి నాయకులు అరెకపూడి రామశాస్త్రులు, గంటా బాలాజీలతో కలసి అయన మాట్లాడుతూ అన్న నందమూరి తారకరామరావు ఏర్పాటు చేసిన టిడిపి 40 సం॥లు పూర్తిచేసుకున్న సందర్భంగా టిడిపి నాయకులకు గురువారం సాయంత్రం 3గం॥లకు వెంకటేశ్వర ఫంక్షన్ హాలలో అత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సేవ కార్యక్రమలలో ప్రజల మన్నలు పొందుతున్న వెనిగండ్ల రాము ముఖ్య అతిధిగా పాల్గోనే ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కర్యకర్తలు పాల్గొన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు రాజశేఖర్, శ్రీలక్ష్మి, ఎం.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సమీక్ష సమావేశం

విశాలాంధ్ర-పెడన : పెడన పట్టణ తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకుల సమీక్ష సమావేశం బుధవారం పార్టీ అధ్యక్షుడు యక్కల. శ్యామలయ్య అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా రాష్ట్ర బి సి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు పాల్గొన్నారు. ఈ సమావేశంలో మాజీ వైస్ చైర్మన్ హన్ను, తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి వాహెబ్ ఖాన్, నాయకులు బొడ్డు దీక్షనందుడు, బెజవాడ నాగరాజు, కమ్మగంటి వెంకటేశ్వ రరావు (బాబు) అనుముల పూర్ణచంద్రరావు, వెలిగట్ల ప్రసాద్, కుర్షిత్ బేగం, తదితరులు పాల్గొన్నారు.

కురుబ కురుమలకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : కురుబ, కురుమ కులస్తులకు రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో అవకాశం కల్పించాలని ఏపీ కురుబ, కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జబ్బల శ్రీనివాసులు, గౌరవ అధ్యక్షులు తట్టి అర్జున్ రావు తెలిపారు. బుధవారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ గత నెలలో తమ సంఘం కార్యవర్గ సమావేశం నిర్వహించామన్నారు.దీనిలో నూతన జనరల్ బాడీని ఎన్నుకోవడం, 16 జిల్లాల్లో నూతన అధ్యక్ష,కార్యదర్శులను ఎన్నుకున్నామని తెలిపారు. తమ సంఘం నూతన జనరల్ బాడీ,ఇతర జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు ప్రమాణ స్వీకారం ఫిబ్రవరి 26వ తేదీన విజయవాడలో నిర్వహిస్తున్నామని దీనికి రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు హాజరవుతున్నారని తెలిపారు.

22న శారదాంబ మహిళా సహకార అర్బన్ బ్యాంక్ పాలకవర్గానికి ఎన్నికలు

విశాలాంధ్ర-విజయవాడ(వన్‌టౌన్) : విజయవాడ సత్యనారాయణ పురంలోని శారదాంబ మహిళా సహకార అర్బన్ బ్యాంక్ పాలకవర్గానికి ఎన్నికలు జనవరి 22న స్థానిక ప్రశాంతి మునిసిపల్ ఎలిమెంటరీ స్కూలులో జరుగుతాయని ఎన్నికల అధికారిగా నియమితులైన వైవి కోటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపాడు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టరు, జిల్లా ఎన్నికల అథారిటీ ఉత్తరువుల మేరకు 11-1-2023న పారం 1 ఎన్నికల నోటీసు విడుదల చేశారు. 13-1-2023న ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నామినేషన్లను బ్యాంకు కార్యాలయంలో స్వీకరిస్తారు. 14-1-2023న ఉదయం 10 గంటల నుంచి పరిశీలిస్తారు. ఉపసంహరణ 15-1-2023 సాయంత్రం 5 గంటల వరకు అనుమతిస్తారు. పోటీ ఉంటే 22-1-2023 ఎన్నికలు స్థానిక ప్రశాంతి మునిసిపల్ ఎలిమెంటర్ స్కూలులో ఉదయం 7 గం.ల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరుగుతాయని, ఎన్నికల ఫలితాలు అదే రోజు ఓట్ల లెక్కింపు అనంతరం ప్రకరిస్తామని తెలిపారు. పోటీ ఉంటే ఎన్నికల ఫలితాలను 15-1- 2023న నామినేషన్ల ఉపసంహరణ అనంతరం ప్రకటిస్తారు. అర్హులైన ఓటర్ల జాబితా బ్యాంకు నోటీసు బోర్డులో ప్రచురించామని, కావాల్సిన వారు బ్యాంకు పని వేళలలో చూసుకోవచ్చని, ఇతర వివరాలకు తనను కానీ బ్యాంకు సి.ఇ.ఓ.ను కానీ బ్యాంకు పనివేళలలో సంప్రదించవచ్చని తెలిపారు. ఎన్నికైన పాలకవర్గ అయిదు సంవత్సరాలపాటు అధికారంలో ఉంటుందని ఎన్నీకలు ఆంధ్రప్రదేశ్ సహకార సంఘాల 1964 చట్టాన్ని అనుసరించి జరుగుతాయని వై. వి. కోటేశ్వరరావు ఎన్నికల అధికారి తెలిపారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు : మండలంలో కోడిపందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్.ఐ. వలదాసి ఏసోబు బుధవారం అన్నారు. గుడ్లవల్లేరు 1వ సచివాలయంలో ఆయన మాట్లాడుతూ కోడిపందేలు చట్ట విరుద్ధమని అన్నారు. ఈ సమావేశంలో తహశీల్దార్ అబ్దుల్ రెహమాన్, ఎమ్.పి.డి.ఓ. దారపు శ్రీనివాస్, పంచాయతీ కార్యాలయాల కార్య నిర్వహణాధికారి ఎ.జె.ఎల్. నరశింహారావు తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, JASTI SURENDRANADHA BABU (Old Name), S/o. Sambasiva Rao, R/o. 1-22/1, Nandivada, Rudrapaka, Krishna Dist., A.P. I, declare that I have changed my name as **JASTI SURENDRANATH BABU** (New Name). So, hereafter my name is known and called as **JASTI SURENDRANATH BABU** only.

ఏఎంసీ చైర్మన్ వెంకట్రావుకు సత్కారం

విశాలాంధ్ర-ఘంటసాల: ఘంటసాల మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్‌గా నూతనంగా ఎంపికైన ఘంటసాల మండల వైసీపీ అధ్యక్షులు వేమూరి వెంకట్రావును అహ్మదీయ జమాత్ సభ్యుల మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ ఆయన మరిన్ని ఉన్నత పదవులు అలంకరించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం ఆయన్ను శాలువాతో సత్కరించి బొకేలు అందించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు షేక్ యాసిన్ సాహెబ్ ఘంటసాల మజీద్ ప్రెసిడెంట్ షేక్ జాకీర్ హుస్సేన్ అక్బర్ అనీఫ్ షరీఫ్ భాషా రసూల్ అల్లావుద్దీన్ నాసర్వలి స్థానిక మసీదు గురువు యాకోబ్ భాష పాల్గొన్నారు.

మహిళా సాధికారతతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం

మహిళా సాధికారతతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని ఘంటసాల ఏఎంసి చైర్మన్ వేమూరి వెంకట్రావు పేర్కొన్నారు. మండల కేంద్రమైన శ్రీ శక్తి భవన్లో సంక్రాంతి సంబరాలు రాష్ట్ర వివోఏల కార్యదర్శి కొల్లూరు నాని ఆధ్వర్యంలో ఘనంగా పురస్కరించుకున్నారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏఎంసీ చైర్మన్ వెంకట్రావు ప్రసంగిస్తూ ప్రతి వివో ఏ కి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి వెన్నంటి ఉండి వారి అభివృద్ధికి ఎంతో తోడ్పాటున అందిస్తున్నారని అన్నారు. ముందుగా ఏఎంసీ చైర్మన్ వెంకటరావుకు శాలువాతో వివోఏలు, సిసి లు మట్ట ఝాన్సీ లక్ష్మి కిలారి శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో దుశ్శాలతో ఘనంగా సత్కరించారు. సర్పంచ్ బాణావతి వెంకటేశ్వరమ్మ, వైస్ ఎంపీపీ కుంపటి నాగేంద్రబాబు, జడ్పిటిసి తుమ్మల మురళీకృష్ణ, ఎమ్మార్వో బి. రామానాయక్, ఎంపీడీవో కే. వి. సుబ్బారావు, ఈవోపీఆర్డి జి. కిషోర్, వైసిపి గ్రామ పార్టీ నాయకులు వేమూరి ప్రవీణ్, వైసీపీ నాయకులు చిట్టూరి రమేష్ వివో ఏలు తదితరులు పాల్గొన్నారు

దాతల సహకారంతో సీసీ కెమేరాలు : ఎస్ఐ శ్రీనివాసు

విశాలాంధ్ర-ఘంటసాల : గ్రామాల్లో శాంతిభద్రతలు పరిరక్షణకే సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని ఎస్సై కుడిపూడి శ్రీనివాసు అన్నారు. మండల కేంద్రమైన ఘంటసాలపాలెం ప్రధాన సెంటర్లో గ్రామ పెద్దల సహకారంతో రూ.24 వేలు విలువ చేసే మూడు సీసీ కెమెరాలను బుధవారం ఏర్పాటు చేసినట్లు ఎస్సై శ్రీనివాసు తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన దాతలకు ఎస్సై శ్రీనివాసు పోలీసు శాఖ తరుపున ధన్యవాదాలు తెలిపారు.

పేర్ని నాని, కలెక్టర్ బాషాలకు బీసీ నాయకుల కృతజ్ఞతలు

విశాలాంధ్ర-మచిలీపట్నం : మాజీ మంత్రి పేర్ని నాని, జిల్లా కలెక్టర్ రంజిత్ బాషాలకు బీ.సీ సంక్షేమ సంఘం కృష్ణా జిల్లా అధ్యక్షులు శేకుబోయిన సుబ్రహ్మణ్యం ధన్యవాదాలు తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కు , బీ.సీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు శేకుబోయిన సుబ్రమణ్యం పుష్పగుచ్చం ఇచ్చి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కోల్గేట్ పామోలీవ్ కంపెనీ వారు సర్వజన ఆస్పత్రికి రూ.50,00,000 విలువైన అత్యధిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన డిజిటల్ ఎక్స్ రే పరికరాన్ని కొంతకాలం క్రితం వితరణగా ఇవ్వడం జరిగిందన్నారు. అయితే చాలాకాలం పరికరం నిరుపయోగంగా ఉన్న విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడం జరిగింద అన్నారు. బీ.సీ సంక్షేమ సంఘం వినతి పై స్పందించి మాజీ మంత్రి పేర్ని నాని చొరవతో జిల్లా కలెక్టర్ రంజిత్ భాష సంబంధిత పరికరాన్ని వెంటనే అందుబాటులోకి తేవడం పట్ల వారికి సుబ్రమణ్యం కృతజ్ఞతా పూర్వక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బిసి సంఘం పట్టణ అధ్యక్షులు తోట బాబు, జోగి శివ, జన్ను గోవిందు, చేబోయిన కోటేశ్వరరావు,పుట్టి రాజశేఖర్, ఎం. పవన్, తదితర బీసీ నాయకులు పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా గ్రామ సభ

విశాలాంధ్ర-అవనిగడ్డ : తూతూ మంత్రంగా పంచాయతీ కార్యలయంలో గ్రామ సభను నిర్వహించారు. గ్రామ సభ నిర్వహించి చేపట్టాల్సిన పనులు చేసిన పనులపై గ్రామస్థుల సహకారం తీసుకునేందుకు గ్రామ సభలను నిర్వహిస్తారు. బుధవారం మధ్యాహ్నం పంచాయితీ కార్యాలయంలో సర్పంచ్ గొరుముచ్చు ఉమా ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామ సభకు సంబంధిత అధికారులతో పాటూ గ్రామస్థులు కూడా ఆశించిన రీతిలో హాజరు కాలేకపోయారు. తూతూ మంత్రంగా గ్రామ సభ నిర్వహించి మమ అనిపించారు.

మహిళపై దాడిచేసిన వ్యక్తి అరెస్టు

విశాలాంధ్ర-కోడూరు : ఈ నెల4వ తేదీన కోడూరు- నక్కవానిదారిలో మోటరు సైకిల్ వెళ్ళుతున్న మందపాకల గ్రామానికి చెందిన కడవకొల్లు రత్నకుమారిపై జరుగుగా దాడిచేసి వ్యక్తి జరుగు అశ్విని కుమార్‌గా గుర్తించి అతను కోడూరు శివారు ఇస్మాయిల్‌బేగ్‌పేటలోని తన ఇంటి వద్ద మంగళవారం సాయంత్రం అరెస్టు చేసినట్లు అవనిగడ్డ సి.ఐ.జి.శ్రీనివాస్, కోడూరు ఎస్.ఐ.వి.రాజేంద్రప్రసాద్ తెలియచేసారు.

చనిపోయిన సంఘ సభ్యుడు కుటుంబానికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర-కోడూరు : కోడూరు ప్రాథిమిక వ్యవసాయ పరపతి సంఘం భాకీదారుడు అయిన రామకృష్ణాపురం గ్రామమునకు చెందిన కందుల నాగేశ్వరరావు మరణించటంతో సంఘం నిబందనల ప్రకారం 10 వేల రూపాయిలు ఆర్థిక సాయాన్ని ఆయన భార్య కందల గోపమ్మకు బుధవారం సంఘ అధ్యక్షులు పరిశె మాధవరావు,సి.ఈ.ఓ. అర్జా నాగరాయులు,గమస్తా పోతేపల్లి నాగబాబు అందచేసారు.

రబి పంటకు ఈ క్రాప్ నమోదు చేసుకోవాలి

విశాలాంధ్ర-గన్నవరం : రబ్బీ పంటకు తప్పనిసరిగా ఈ క్రాప్ నమోదు చేయూకోవలని వ్యవసాయ శాఖ ఏ డి ఏ సునీత తెలిపారు.మంగళవారం గన్నవరం వ్యవసాయ శాఖ కార్యాలయంలో రైతుల తో సమావేశం జరిగింది ఈ రబ్బీ పంటకు రైతులు ఈ క్రాపు నమోదు చేసుకోవాలని సూచించారు .రైతులు వేసే పంటను రైతు భరోసా కేంద్రంలో నమోదు చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమ వ్యవసాయశాఖ అధికారి ఎన్ ఎల్ తేజశ్రీ రైతు భరోసా సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధురాలని కుటుంబసభ్యుల చెంతకు చేర్చిన అర్‌కె

విశాలాంధ్ర-గుడివాడ : ఇటీవల రోడ్డున వదిలేసిన వృద్ధ తల్లిని ఆశ్రమం కల్పించిన జనసేన ఆర్‌కె ఆశ్రయం కల్పించిన విషయం విధితమే. బుధవారం వృద్ధురాలు కుటుంబ సభ్యులు జనసేన నాయకుడు మాచర్ల రామకృష్ణ(ఆర్‌కె)ను అభినందించి కృతజ్ఞాతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్‌కె మాట్లాడుతూ అందరూ ఉండి చివరి దశలో ఇలా ఒంటరిగా వదిలి వేయడం బాదరమన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన ముస్లిం మైనారిటీ నాయకులు షేక్ మీరాషరీఫ్, అయ్యప్ప, సురేష్,చరణ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా : ఎమ్మెల్యే కైలే

విశాలాంధ్ర-పెదపారుపూడి : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో పాలన సాగుతుందని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ అన్నారు. మండలంలోని వానపాముల గ్రామంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వంలో భాగంగ ప్రతి ఇంటికి వెళ్లి ఇప్పటి వరకు ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల వివరాలను తెలియజేస్తూ ఇక ముందు కూడా ప్రజల కోసం పటిష్టమైన ప్రణాళికతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలన సాగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడీఓ టి.సీతామహలక్ష్మి తహసిల్దార్ వి. నాగభూషణం, పంచాయతీరాజ్ ఏఈ కే రంగారావు, ఎంపీపీ గోగం సురేష్, గ్రామ సర్పంచ్ పాతూరి రమేష్, పిఎసిఎస్ అధ్యక్షులు పల్లా అరవింద్, వైసీపీ సీనియర్ నాయకులు గోళ సోమేశ్వరరావు, జెడ్పిటిసి మాజీ సభ్యురాలు మూల్పూరి హరీష, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నాయకులు ఎంజే రాయ్ మృతి

సామాజిక న్యాయవాది ఎంజే రాయ్ : మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ నివాళి

విశాలాంధ్ర-విజయవాడ : ప్రముఖ న్యాయవాది, సీపీఐ నాయకులు మర్రి జోసెఫ్ రాయ్(58) విజయవాడ గులాబితోటలోని ఆయన ఇంటిలో బుధవారం తెల్లవారుజాము గుండెపోటులో హఠాత్తుగా మరణించారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఎంజే.రాయ్ మరణవార్త తెలుసుకున్న మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు చలసాని అజయ్‌కుమార్, సీపీఐ జిల్లా డిప్యూటీ కార్యదర్శి దోనేపూడి శంకర్, విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బుట్టి రాయప్ప, రాయ్ నివాసానికి చేరుకుని ఆయన మృతదేహంపై పూలమాలలు వేసి అరుణపతాకం కప్పి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా జల్లి విల్సన్ మాట్లాడుతూ సామాజిక వివక్షతలను రూపుమాపేందుకు అహర్నిశలు శ్రమించిన ఎంజే.రాయ్ మరణం తీరనిలోటన్నారు. న్యాయవాదిగా బాధ్యతలు నిర్వహించడమే కాకుండా సామాజిక వివక్షతలను తొలగించేందుకు అంకిత భావంతో పని చేశారని చెప్పారు.

సుప్రీంకోర్టు, హైకోర్టు జడ్జీల నియామకంలో రిజర్వేషన్లు అమలు జరపాలని తాము జరిపిన సదస్సులు, సభలకు రాయ్ అందించిన సహకారం మరువలేనిదన్నారు. కేదారేశ్వరపేట, కార్మికపురం తదితర ప్రాంతాలలో పార్టీ శ్రేణులకు న్యాయ సహాయం చేయడంలో ముందుండేవారని గుర్తు చేసుకున్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలు రాయ్ మృతదేహానికి సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. సాయంత్రం భవానీపురంలోని స్మశానవాటికలో రాయ్ అంత్యక్రియలు జరిగాయి. రాయ్‌కు నివాళులర్పించిన వారిలో ప్రముఖ న్యాయవాదులు సుంకర రాజేంద్రప్రసాద్, కె.వి.పరమేశ్వరరావు, సాయిశంకర్, ఎస్కె.షరీఫ్, జయమ్మ, సీనియర్ పాత్రికేయులు ఎస్.కె.బాబు, సీపీఐ నాయకులు సంగుల పేరయ్య, కొండపల్లి కృష్ణ, బి.వెంకట్రావ్, జి.వి.రాజు, కాళ్ల చిన్నప్ప, కాళ్ల విజయ్, దొడ్డా కుమార్, శ్రీను, కాళ్ల ప్రకాశరావు, సీహెచ్.సైదులు, సీహెచ్.మారయ్య, సీహెచ్. వెలంగిణమ్మ,యు.నారాయణ, జి.ప్రసాద్, కాటుమాల జోసెఫ్, కాళ్ల థామస్ తదితరులు ఉన్నారు.

జగనన్న తోడుతో చిరు వ్యాపారులకు ఆర్థిక భరోసా

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : జగనన్న తోడుతో చిరు వ్యాపారులను ఆర్థికంగా బలోపేతం చేయాలన్న లక్ష్యంతో జిల్లాలో 25,465 మంది చిరు వ్యాపారులు, సాంప్రదాయ చేతి వృత్తుల వారికి రూ.57 లక్షల 6వేల 53 వడ్డీని లబ్దిదారుల ఖాతాలో జమ చేసి ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు తెలిపారు. జగనన్న తోడు పథకం ద్వారా రాష్ట్రంలోని లబ్దిదారులకు బుధవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుండి లబ్దిదారుల ఖాతాలకు బటన్ నొక్కి వడ్డీ మొత్తాన్ని జమ చేశారు. కలెక్టర్ కార్యాలయం నుండి అధికారులు, లబ్దిదారులతో కలిసి ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించిన అనంతరం జిల్లాకు చెందిన లబ్దిదారులకు చెక్‌ను కలెక్టర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఫైబర్ నెట్ కార్పొరేషన్ చైర్మన్ పీ.గౌతమ్‌రెడ్డి, నగర డిప్యూటీ మేయర్ అవుతు శైలజారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ కే.శ్రీనివాస్, ఎల్‌డీఎం పీ.కోటేశ్వరరావు, మెప్మా పీడీ ఎస్ఎన్.విశాలాక్షి, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి కె.అనురాధ పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు అండగా జగనన్న తోడు : కమిషనర్ దినకర్

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : చిరు వ్యాపారులకు అండగా జగనన్న తోడు పథకం నిలుస్తుందని నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. జగనన్న తోడు పథకం అమల్లో భాగంగా తూర్పు నియోజకవర్గంలో బుధవారం జగనన్న తోడు కార్యక్రమాన్ని నిర్వహించి లబ్దిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, కార్పొరేటర్లు అంబడిపూడి నిర్మల కుమారి, భీమిశెట్టి ప్రవల్లిక, మొహమ్మద్ రెహనా నాహిద్, కోఆప్షన్ సభ్యులు సయ్యద్ అలీమ్, జోనల్ కమిషనర్-3 డాక్టర్ ఏ.రవిచంద్, యూసీడీ పీవో శకుంతల అధికారులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర-వీరులపాడు : మండలంలోని అల్లూరు గ్రామం లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ మరియు జిల్లా ఎయిడ్స్ నియంత్రణ నివారణ సంస్థ సహకారంతో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని కమ్యూనిటీ హాల్ నందు బుధవారం నిర్వహించారు. చైల్డ్ ఫండ్ ఇండియా జోనల్ సూపర్వైజర్ సుందర్ రావు మాట్లాడుతూ గ్రామంలో అందరూ తమరి యొక్క హెచ్ఐవి స్థితిని తెలుసుకొని భావితరాలకు మంచి భవిష్యత్తు నివ్వాలని తెలియజేసారు. ఈ వైద్య శిబిరంలో బీపీ మరియు హెచ్ఐవి రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ గౌతమ్, సూపర్వైజర్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

హాకర్స్ యూనియన్ నాయకులు తమ్మిన మృతి

విశాలాంధ్ర-విజయవాడ (చిట్టినగర్) : విజయవాడ హాకర్స్ యూనియన్ ఉపాధ్యక్షుడు తమ్మిన నరసింహారావు (68) గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం తెల్లవారుజామున కెఎల్‌రావు నగర్‌లోని స్వగృహంలో మరణించారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆయన మరణవార్త తెలిసిన వెంటనే సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి జి. కోటేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు డివి రమణబాబు భౌతికాయన్ని సందర్శించి నివాళులు అర్పించారు, కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు, ఈ సందర్భంగా అర్బన్ హాకర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కొట్టు రమణారావు మాట్లాడుతూ నరసింహారావు ఉపాధ్యక్షుడుగా యూనియన్ కి సేవలు అందిస్తూ, నగర ఏఐటీయూసీ కార్యక్రమాలలో నరసింహారావు చురుకుగా పాల్గొనే వారని, ఆయన మరణం యూనియన్‌కి తీరని లోటని శ్రద్ధాంజలి ఘటించారు. ఉపాధ్యక్షులు అప్పలనాయుడు, కోశాధికారి కోరికాని నేలంనాయుడు, స్థానిక నాయకులు ఎస్ వి రమణ, బెవర శ్రీను, చీర్ల రామస్వామి పలువురు వ్యాపారస్తులు భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. సాయంత్రం నరసింహారావుకు అంత్యక్రియలు జరిగాయి.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది సమర్థవంతంగా పనిచేస్తూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.నూపూర్ అజయ్ అన్నారు. నగరంలోని సింగ్‌నగర్ స్టేడియంలోని వార్డు సచివాలయాన్ని బుధవారం జేసీ ఆకస్మిక తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ వార్డు సచివాలయాల పరిధిలో ప్రజల నుండి అందిన ఫిర్యాదులను సంబంధిత అధికారులకు తెలియజేసి ఆయా సమస్యలను పరిష్కరించడంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సకాలంలో లబ్దిదారులకు అందించే విధంగా సిబ్బంది మెరుగైన సేవలందించాలన్నారు. సచివాలయంలో సిబ్బంది హాజరు పట్టిక, ఉద్యోగుల మూవ్మెంట్ రిజిస్టర్, సంక్షేమ పథకాల క్యాలెండర్, ఎస్ఎల్ఏ గడువులోగా ప్రజా సమస్యల పరిష్కార చర్యల నివేదిక, ప్రభుత్వ పథకాల పోస్టర్లు తదితర వాటిని పరిశీలించారు. బయోమెట్రిక్ తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు. తహశిల్దార్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

విశాలాంధ్ర
ఎన్టీఆర్ జిల్లా

ప్రజావ్యతిరేక జీఓను రద్దు చేయాలి

సీపీఐ నాయకుల డిమాండ్

విశాలాంధ్ర-తిరువూరు: రహదారి ప్రధాన కూడళ్లు, బహిరంగ ప్రదేశాల్లో సభలు, సమావేశాలు నిర్వహించకూడదని రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రజావ్యతిరేక జీవో 1ను వెంటనే రద్దుచేయాలని కోరుతూ స్థానిక బస్టాండ్ సెంటర్లో సీపీఐ నాయకులు బుధవారం ఆందోళన చేశారు. ప్రజా సమస్యలపై రాజకీయ పార్టీలు గళమెత్తకుండా, ప్రభుత్వ అనుచిత విధానాన్ని నిరసిస్తూ పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ నాయకులు జీవో ప్రతులను తగలబెట్టారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు, భావ ప్రకటన స్వేచ్ఛను హరించేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కుట్రపూరితంగా ఈ జీవోను అమలు చేస్తున్నారని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తూము కృష్ణయ్య అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రతిపక్ష పార్టీలు బహిర్గతం చేస్తాయన్న భయంతోనే ముఖ్యమంత్రి అప్రజాస్వామిక విధానాలకు పాల్పడుతున్నారని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ కార్యదర్శి ఎస్ కే నాగుల్ మీరా, పట్టణ ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సుందరరావు, పార్టీ నాయకులు సుభాని, నాగుల్ మీరా, అశోక్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

మండల తరలింపు వెనక్కి తీసుకోవాలి

27వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు

విశాలాంధ్ర-వీరులపాడు: మండల కేంద్రాన్ని వీరులపాడు లోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ 27వ రోజు రిలే నిరాహార దీక్షలు వీరులపాడు గ్రామస్తులు బుధవారం పాల్గొన్నారు.27 వ రోజున రిలే నిరాహార దీక్షలో గద్దల ఏసమ్మ,సొంబెత్తిన వెంకట్ రావమ్మ, కలక రమణ, అద్దంకి ఉషారాణి,సుంకర వెంకట్ రావమ్మ, కట్ట ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రం తరలింపు నిర్ణయం ప్రభుత్వం వెనక్కి తీసుకునే వరకు తమ నిరసనను రోజు రోజుకి ఉధృతం చేస్తామని తెలిపారు.

మానవీయ విలువలు పెంపొందించుకోవాలి

విశాలాంధ్ర-విజయవాడ : విద్యార్థులు వ్యక్తిత్వ వికాసంతో పాటు మానవీయ విలువలు పెంపొందించుకోవాలని అమెరికాకు చెందిన ప్రొఫెసర్లు సూచించారు. ఆంధ్ర లయోలా ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం 'ట్రాన్స్‌ఫార్మింగ్ ది వరల్డ్' అనే అంశంపై అంతర్జాతీయ వర్క్‌షాపు జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రొఫెసర్ జాన్ మాట్లాడుతూ ప్రతి వ్యక్తీ తన సామర్థ్యాలను గుర్తించి ముందుకెళ్లాలని సూచించారు. సమాజాన్ని ప్రభావితం చేసేలా ఆలోచన ధోరణులు కలిగి ఉండాలన్నారు. ఏసుక్రీస్తు, గౌతమబుద్ధుడు, మహ్మద్ ప్రవక్త, మహాత్మగాంధీ వంటి మహనీయులు వారి జీవితాలను మార్చుకుని ప్రపంచాన్ని నూతన పద్ధతిలో తీర్చిదిద్దారని వివరించారు. మరో ప్రొఫెసర్ లైలా గ్రోలో మాట్లాడుతూ ప్రతిఒక్కరి పట్ల ప్రేమ భావంతో మెలగాలన్నారు. స్నేహంతో కలిసి జీవించాలని సూచించారు. మార్పు చెందుతున్న ప్రపంచంతో పాటు కొత్త సాంకేతికతను అందిపుచ్చుకుని ప్రగతి సాధించాలని చెప్పారు. సిస్టర్ క్యాండీ డి. కూన నేతృత్వంలో ఈ సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎ.ఫ్రాన్సిస్ జావియర్, ప్రిన్సిపల్ డాక్టర్ ఒ.మహేష్, అసిస్టెంట్ డైరెక్టర్ ఫాదర్ బాలస్వామి, ఫాదర్ రవీంద్ర, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు భారతీయ సాంస్కృతిని, సంప్రదాయాలను వివరిస్తూ ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

యువకుడి ఆత్మహత్య

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : నవాబుపేట గ్రామ శివారు పంట పొలంలో ఒక చెట్టుకి ఉరివేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం స్థానిక ఎస్ఐ హరిప్రసాద్ వివరాల ప్రకారం నందిగామ శివారు హనుమంతుపాలెం గ్రామానికి చెందిన గాడిపర్తి శివకృష్ణగా గుర్తించామని, ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని అన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బొమ్మికి నివాళులు

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : స్థానిక వైసీపీ సీనియర్ నాయకులు బొమ్మి శ్రీనివాసరావు అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకొని జెడ్పీటీసీ, వైసీపీ మండల అధ్యక్షుడు పూట్ల నాగేశ్వరరావు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మండల వైసీపీ అధ్యక్షులు పూట్ల నాగేశ్వరరావు, సొసైటీ అధ్యక్షులు గింజుపల్లి నరసయ్య, నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ నరెడ్ల కిశోర్, మాజీ సొసైటీ అధ్యక్షులు కొల్లా రఘురామయ్య, నల్లపునేని వెంకటనారాయణ తదితరులు నివాళులర్పించారు.

సర్వే పొరపాట్లు నిజమే : డివిజన్ సర్వే అధికారి సారంగఫాణి

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: ప్రభుత్వం చేపట్టిన సమగ్ర భూసర్వే విభాగంలో విస్సన్నపేట మండలంలో కొన్ని పొరపాట్లు జరిగిన మాట వాస్తవమేనని తిరువూరు డివిజన్ సర్వే అధికారి సారంగఫాణి తెలిపారు. ఎన్టీఆర్ జిల్లాలో పైలెట్ ప్రాజక్టుగా తొలివిడత జగనన్న శాశ్వత భూహక్కు పథకంలో భాగంగా 12 గ్రామాలను ఎంపిక చేసి, డ్రోన్ సర్వే నిర్వహించటం జరిగిందన్నారు. వీటిలో విస్సన్నపేట మండలంలోని చంద్రుపట్ల గ్రామంలోనే పలువురు రైతుల భూముల నమోదులో పొరపాట్లు దొర్లాయన్నారు. వీటిని సరిచేసేందుకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. రెండవ విడత పథకంలో ఎన్టీఆర్ జిల్లాలో ఒక్క గ్రామాన్ని కూడా ఎంపిక చేయలేదని ఆయన పేర్కొన్నారు.

సమగ్ర ప్రణాళికలు రూపొందించండి

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: విద్యా సంవత్సర సమగ్ర ప్రణాళికల రూపకల్పనలో ఉపాధ్యాయులు నిమగ్నమవ్వాలని విస్సన్నపేట ఎమ్మీవో సీహెచ్.రామకృష్ణ సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం జరిగిన ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో శిక్షకునిగా వ్యవహరించిన జి.శివయ్య కూడా పాల్గొన్నారు.

నాటుసారా విక్రేతలపై ఎస్ఈబీ దాడులు

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: తిరువూరు ఎస్ఈబీ అధికారులు విస్సన్నపేట, తిరువూరు మండలాల్లోని పలు గ్రామాల్లో నాటుసారా విక్రయాలపై బుధవారం దాడులు నిర్వహించి, పలువురు నాటుసారా విక్రేతలను అరెస్టు చేశారు. ఎస్ఈబీ సీఐ బి.గురవయ్య తెలిపిన వివరాల ప్రకారం, విస్సన్నపేట మండలంలోని పుట్రేలకు చెందిన చాపలమడుగు రాములమ్మను అరెస్టు చేసి, ఐదు లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. కలగరకు చెందిన బాణావతు చిన్నతావురియా నుంచి రెండు లీటర్ల నాటుసారా, ఒక టీవీఎస్ మోపెడ్‌ను స్వాధీనం చేసుకున్నారు. వేమిరెడ్డిపల్లి తండాకు చెందిన బాణావతు భీముడు నుంచి 10లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరితోపాటు తిరువూరు మండలం మల్లేలకు చెందిన సంగం రత్తయ్యను కూడా అరెస్టు చేసినట్లు వివరించారు.

ఆటో ఎక్స్ పోలో కియా కాన్సెప్ట్ ఈవీ9, కొత్త కేఏ4 ప్రదర్శన

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): దేశంలో అతి వేగంగా పెరుగుతున్న కారు తయారీదార్లలో ఒకటైన కియా ఇండియా, భవిష్యత్తు గురించి ఒక వీక్షణాన్ని చూపించింది. దీని ప్రకారం ప్రయాణం మరింత సుస్థిరంగా, కొత్తగా, నిజంగా కనక్ట్ చేయబడి ఉంటుంది. బ్రాండ్ తన సరికొత్త-ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ కాన్సెప్ట్ - ద కియా కాన్సెప్ట్ ఈవీ9ను కూడా ఆటో ఎక్స్‌పో 16వ ఎడిషన్ లో విడుదల చేసింది.

క్రీడలతో మానసికోల్లాసం : సీఐ భీమరాజు

విశాలాంధ్ర-తిరువూరు: క్రీడలతో పోటీతత్వంతో పాటు మానసికోల్లాసం లభిస్తుందని తిరువూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆర్ భీమరాజు అన్నారు. సంక్రాంతి పండగను పురస్కరించుకుని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో తిరువూరు వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన షటిల్ డబుల్స్ టోర్నమెంట్ పోటీలను సిఐ భీమరాజు ప్రారంభించారు. విద్యార్థులు, యువత చెడు అలవాట్లను వీడి, సంప్రదాయ క్రీడలవైపు దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ పద్మారావు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సోమేశ్వరావు, ప్రజా సంఘాల నాయకులు ఎం.నాగేంద్ర ప్రసాద్, పంతంగి శ్రీనివాసరావు, బి.వెంకటేశ్వరరావు, ఆకుల రవి, ఎల్.గంగాధర్, కె.పాపారావు, ఎం.హరికృష్ణ, కె.వెంకతరత్నం, చెరుకు సత్యనారాయణ, ఎస్.వెంకటేశ్వర్లు, ఎం.ప్రభాకరరావు, ఎస్వీ.భద్రం పాల్గొన్నారు.

ప్రశ్నించే వారిపై దాడులు శోచనీయం

విశాలాంధ్ర- కంచికచర్ల: సీఎం జగన్ అధికారాన్ని అడ్డుపెట్టుకొని ప్రశ్నించే వారి గొంతుకలను నొక్కి వేయడం చేతకాని పరిపాలనకు నిదర్శనమని నందిగామ మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. స్థానిక అంబేద్కర్ కాలనీలో బుధవారం ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పాల్గొన్నారు. తొలుత ఆయా కాలనీ ప్రజల నుంచి ప్రభుత్వ అసమర్థత పాలనపై అభిప్రాయాలను సౌమ్య సేకరించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ఇదేం కర్మ మన రాష్ట్రానికి అనే కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సౌమ్య మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రశ్నించే హక్కు ఎవరికైనా ఉందని, పింఛను రావట్లేదని ప్రశ్నించినందుకు వారిపై అమానుషంగా దాడులు జరపటం ఏమిటిని ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక యువత దూర ప్రాంతాలకు వలస పోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు కోగంటి బాబు గుర్రం రామకృష్ణ, గుత్త రత్నం, వేమా వెంకటరావు, పేరకలపాడు సర్పంచ్ మన్నే సాత్విక, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి అల్లడి కోటేశ్వరరావు, వార్డ్ మెంబర్ గుత్త ఓంకార్ గూడవల్లి గణేష్, మార్తా నరసింహారావు, ఎర్రగొర్ల విజయ్, రొంపిచర్ల శ్యాము, బాణవత్ త్రివేణి, బొందల ఇజ్రాయిల్, బాణావత్ సైదులు టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

విజయవాడ పీఆర్ ఉద్యోగుల సంఘం ఎన్నికలు ఏకగ్రీవం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): పంచాయతీరాజ్ మినిస్టరియల్ ఉద్యోగుల సంఘం విజయవాడ యూనిట్ ఎన్నికలు విజయవాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగాయి. ఎన్నికల అధికారి గా శ్రీనివాస్ వ్యవరించ్చారు.ఎన్ని కైన వారి వివరాలు ఈ విధంగా ఉన్నాయి. సంఘ అధ్యక్షులు గా కె. సాయి గోపాల్, ఉపాధ్యక్షులు గా బి. విజయబాబు, ప్రధాన కార్యదర్శి గా ఎన్. షణ్ముఖ చారి, సహాయ కార్యదర్శి గా ఎం. ఝన్సీ లక్ష్మి, కోశాధికారి గా వి. ప్రభాకర్, జిల్లా కౌన్సిలర్ లు గా వి. శ్యాంసన్ బాబు, డి. వి. కిషోర్ లు ఎన్నికయ్యారు.

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర-విజయవాడ : మొగల్రాజపురం వీరమాచనేని సిద్ధార్థ పబ్లిక్ పాఠశాలలో బుధవారం సంక్రాంతి సంబరాలు కన్నుల పండువగా జరిగాయి. రంగవల్లులు దిద్ది ,గొబ్బెమ్మలు, చెరుకు గడలు, బొమ్మల కొలువు పెట్టి, భోగి మంటలు, గాలిపటాల ఎగుర వేసి ,హరిదాసులు, బుడబుక్కల వాళ్ళు, గంగిరెద్దులు, గోదాదేవి, రైతులు వివిధ రకాల వేషధారణలో విద్యార్థులు అలరించారు. గ్రామీణ వాతావరణం ప్రతిబింబించే విధంగా ఈ వేడుక జరిగింది. భోగి, మకర సంక్రాంతి, కనుమ పండుగ విశేషాలు తెలియజేస్తూ విష్ణు స్తోత్రాలు, గోదాదేవి పాశురాలు, గీతాలు ఆలపించి, నృత్యాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సంచాలకులు మేడా సీతారామయ్య, ప్రధాన ఉపాధ్యాయురాలు సిహెచ్ జయలక్ష్మి పాల్గొని పాఠశాల చిన్నారులకు భోగి పళ్ళు పోసి, ఆశీర్వదించి పండుగ యొక్క ప్రాధాన్యతను వివరించారు.

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

విశాలాంధ్ర-విజయవాడ : జూబిలీ ఇండోర్ విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో విద్యుత్ మరమ్మత్తులు మెయింటెనెన్స్ నిమిత్తం గురువారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని విజయవాడ టౌన్ ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీరు బి.వి.సుధాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సరఫరా నిలిపివేయు ప్రాంతములు : మొఘలరాజపురం సెక్షన్, 11 కేవీ ఆల్ ఇండియా రేడియో ఫీడర్ పరిధిలోని రెడ్ సర్కిల్ ఏరియా, గిరిపురం, స్టేడియం రోడ్డు, బందర్ రోడ్డు, పోలీస్ కమాండ్ కంట్రోల్ ఆఫీస్ ఏరియా, ఆర్ అండ్ బి కాంప్లెక్స్, వ్యాస్ కాంప్లెక్స్, మాంటిసోరి కాలేజీ రోడ్డు, సబ్ కలెక్టర్ ఆఫీస్, పున్నమ్మ తోట, స్వగృహ ఫుడ్స్ ఏరియా, రైల్వే క్వార్టర్స్, పాస్ పోర్ట్ ఆఫీస్ ఏరియా తదితర ప్రాంతాలు. సూర్యారావుపేట సెక్షన్11 కేవీ డోర్నకల్ రోడ్ ఫీడర్ పరిధిలో చిలుకు దుర్గయ్య వీధి, విష్ణువర్ధనరావు వీధి, వెంకటరత్నం వీధి, పీసపాటి వారి వీధి, తాడేపల్లి వారి వీధి, నరసింహారావునాయుడు వీధి, గోవిందరాజులునాయుడు వీధి ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రతి కుటుంబానికి నవరత్నాలు ఎన్నికల హామీలు నెరవేర్చిన సీఎం జగన్

విశాలాంధ్ర-గంపలగూడెం. : రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్నికల వాగ్దానాలు నెరవేర్చటంలో నూరు శాతం ఫలితాలు సాధించారని తిరువూరు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ. రక్షణ నిధి అన్నారు. ఆయన బుధవారం నాడు మండలంలోని కొత్తపల్లి గ్రామంలో రెండో రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికి వెళ్లి నవరత్నాల అందినాయ అని కుటుంబ సభ్యుల ను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ జి .బాలకృష్ణారెడ్డి , ఎంపీడీవో ఎర్రమల. పిచ్చిరెడ్డి, ఎంపీపీ గోగులమూడి. శ్రీలక్ష్మి, జడ్పీటిసి కోట. శ్యామ్యూల్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు చెరుకు. నరసారెడ్డి ,గోగులమూడి. చెన్నకేశవరెడ్డి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

విద్యాలయాల్లో నెలకొన్న సంక్రాంతి శోభ

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: విస్సన్నపేట మండలంలోని పలు విద్యాలయాల్లో సంక్రాంతి శోభ ముందస్తుగానే విద్యాలయాల్లో నెలకొంది. మండలంలోని తాతకుంట్ల తండా, కొండపర్వ ఎంపీయూపీ పాఠశాల, సిద్ధార్థ టెక్నో, శ్రీచైతన్య, శ్రీశ్రీ విద్యాలయాల్లో సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బడి ముందు విద్యార్థినులు రంగవల్లులు తీర్చిదిద్దగా, హరిదాసులు, గంగిరెద్దుల ఆటలతో విద్యార్థులు అలరించారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, విజయవాడ
యస్.ఓ.పి.నెం.2/2023
పిటీషన్ :
(1) నీలిశెట్టి వెంకట జానకి షావుకార్
(2) మిర్యాల సౌజన్య
(3) నీలిశెట్టి సుబ్బరత్నం - పిటిషనర్లు
మరియు
నిల్ - రెస్పాండెంట్
పై నెంబరు పిటిషన్లో పిటిషనర్లు పై కోర్టు నందు వారసత్వ హక్కు కొరకు పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్ నందు ఎవరికైనా అభ్యంతరాలు ఉన్న యెడల పైన ఉదహరించిన శ్రీ కోర్టులో ది.03.02.2023వ తేదీన ఉదయం 10.30 లకు హాజరై ఆక్షేపణలు, అభ్యంతరములు తెలుపుకొనగలరు. లేనిచో పరోక్షమున తీర్మానించబడునని యిందు మూలముగా తెలియజేయడమైనది.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వులను అనుసరించి)
జి.పి.రాజు
న్యాయవాది, విజయవాడ.
సెల్ : 9963048085

పాస్‌పోర్టు పోయినది
శ్రీమతి సౌమ్య మేదరమెట్ల గారి పాస్‌పోర్ట్ నెం: B1381118 విజయవాడ పరిసర ప్రాంతం నందు పోయినది. ఈ పాస్‌పోర్ట్ దొరికిన వారు ఈ క్రింది చిరునామ నందు అందజేయగలరు.
పాపులర్ షూమార్ట్
డోర్ నెం : 26-13-51,
గాంధీనగర్, విజయవాడ-3

పోయినవి
నా పూర్తి స్వాధీన హక్కు భుక్తములలో గల నా ఆస్తి అనగా కృష్ణాజిల్లా, మచిలీపట్నం మండలం, చిలకలపూడి శివారు మేకా వాని పాలేం గ్రామ పంచాయితీలో చేరిన ఆర్.ఏస్. నెం.118/4 దాఖలా య.0.41 సెంట్లు, ఆర్.ఏస్. నెం. 118/3 దాఖలా య. 0.05 సెంట్లు వెరశి య.0.46 సెంట్లు శేరి మేరక భూమి ఓరిజినల్ లింకు విక్రయ దస్తావేజులు అనగా మచిలీపట్నం సబ్ రిజిష్టారు దాఖలా దస్తావేజు నెం. 991/2010, 992/2010 మరియు ఓరిజినల్ భాగ పంపిణీ దస్తావేజు నెం. 4698/2017 గల దస్తావేజు నేను బండి మీద వెళుతుండగా ది.07-01-2023వ తేదీన గొల్లపూడిలోని నా ఇంటి దగ్గర నుండి స్వాతీ సెంటర్ మార్గ మధ్యలో పడిపోయినవి. ఎవ్వరికైనను దొరికినచో ఈ క్రింది నంబరుకు ఫోను చేయగలరు లేదా ఈ క్రింది అడ్రస్సుకు తెలియపరచగలరు.
M.రవి కుమార్
S/o. అయ్యన్న,
ప్లాటు నెం. 191, 6th క్రాసు రోడ్డు, సాయిపురం కాలనీ, గొల్లపూడి, విజయవాడ రూరల్. NTR జిల్లా.
Cell No.9642238999

బహిరంగ ప్రకటన
నాక్లయింటు అయిన విజయవాడసిటీ, గుణదల గ్రామం, కమర్షియల్ ట్యాక్సెస్ కాలనీ, రోడ్.నెం.2, రిఖ్ గ్రాండ్యర్ అపార్ట్‌మెంట్ ఫ్లాట్ నెం.102, డోర్.నెం.54-20-1-48 కాపురస్తులు కోటేశ్వరరావు చదలవాడ,S/o.వెంకటేశ్వరరావు గారి సూచనల మేరకు యావన్మందికి తెలియజేయునదేమనగా, నాక్లయింటు దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని మాదినేని సాంబశివరావుగారి కుమార్తెయున్నూ, కొమ్మారెడ్డి సురేష్@ సురేష్ రెడ్డిగారి భార్య అయిన కొమ్మారెడ్డి దీప్తి @ దీప్తి చౌదరి గారి వద్ద నుండి కొనుగోలుచేసి విక్రయ ద.నెం.3973/2018గా ది.27-06-2018న గుణదల యస్.ఆర్.ఓ. ద్వారా రిజిష్టర్ పొందియున్నారు.సదరు ఆస్తి కొమ్మారెడ్డి దీప్తి @ దీప్తి చౌదరి గారికి ఆమె తల్లిగారైన కిలారు ధనలక్ష్మీగారు ది. 15-03-2018న దఖలు దస్తావేజు నెం.1570/2018 యస్.ఆర్.ఓ. విజయవాడ ఈస్ట్ జిల్లా రిజిష్ట్రారు ఆఫీసులో రిజిష్టరు కాబడిన రీత్యా సంక్రమించినదని సదరు ఆస్తికి 2018కి పూర్వపు ఎటువంటి డాక్యుమెంట్లు లేవని తెలిపి నాక్లయింటుకు అమ్మగా నాక్లయింటు కొనుగోలుచేసి సర్వ హక్కులతో అనుభవించు చున్నారు అట్టి ఆస్తిపై ఋణంకొరకు పూనావాలా ఫిన్ కార్ప్, విజయవాడ బ్రాంచ్ వారిని సంప్రదించియున్నారు. కావున షెడ్యూలు ఆస్తిపై గాని, పొందబోవు ఋణంపై గాని ఎవరికైననూ ఏవిధమైన అభ్యంతరములు, క్లయిములు, సెక్యూరిటీలు, హక్కులు, వగైరాలు ఉన్నచో 7రోజుల లోపు వ్రాత పూర్వకంగా ఈక్రింది అడ్రస్‌కు తెలియజేయవలెనని గడువులోపల ఎటువంటి క్లయిములు తెలియజేయనిచో నిష్పేచి ఆస్తిగా భావించి నా క్లయింటు సదరు ఆస్తిపై ఋణం పొందెదరని, గడువు అనంతరమువచ్చు ఆక్షేపణలు, వగైరాలు నాక్లయింటు హక్కులను బైండుచేయుజాలవు.
షెడ్యూలు:కృష్ణాజిల్లా, విజయవాడ తూర్పుజిల్లా రిజిస్ట్రారు, గుణదల సబ్.డి॥, వి.యం.సి. ఏరియాలో చేరినటువంటి గుణదల గ్రామ రీ-సర్వే నెం.314/5రు దాఖలా మున్సిపల్ వార్డు నెం.33, పాత అసెస్మెంట్ నెం.39372ఎ, ప్రస్తుత అసెస్మెంట్ నెం.291571రు, డోర్.నెం.15-4-1బి దాఖలా చ.గ.285లు నివేశన స్థలము ఇందులోగల గ్రౌండుఫ్లోరు ఆర్.సి.సి. మరియు ఫస్ట్ ఫ్లోర్ ఏ.సి.సి. కట్టడములకు హద్దులు. తూర్పు: శేషగిరిరావు ఆస్తి, దక్షిణం: ధర్మారావు గురునాథంగారి ఆస్తి, పడమర: కొమ్మారెడ్డి దీప్తి @ దీప్తి చౌదరి గారి ఆస్తి, ఉత్తరం: మున్సిపల్ కార్పోరేషన్ వారి రోడ్డు కొంతవరకున్నూ, మల్లిపెద్ది వెంకటరావు గారి ఆస్తి.
సాంబేలు ఆంజనేయ ప్రసాద్, అడ్వకేట్
AP LAW FIRM, డోర్.నెం.54-15-13, మధు టవర్స్, ఫ్లాట్ నెం.ఎఫ్.ఎఫ్.2, భారతీ నగర్, శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీ, ఐ.సి.ఐ.సిఐ బ్యాంక్ ప్రక్కన, విజయవాడ.సెల్: 9949533987
విజయవాడ, తేది: 11-01-2023